తండ్రి కర్మకాండల్ని
ఆ కొడుకు
సాంప్రదాయబద్ధంగా
జరిపించక పోవడానికి
కారణం?

# - సీతాసత్య
# కథ

## మీమాంస

రోజూ ఏడు గంటలకు లేవడం నాకలవాటు. శ్రీమతి నాకంటే గంట ముందే నిద్రలేస్తుంది. నేను ప్రతిరోజూ నిద్ర లేచే సమయానికి వంటింట్లో గిన్నెల చప్పుళ్ళూ, డ్రాయింగ్ రూమ్‌లోంచి పాఠాలు కంఠతాపట్టే పిల్లల గొంతులూ, వరండాలోని వాలు కుర్చీలో పడుకుని పైకి వినబడేలా వార్తాపత్రికను చదివే నాన్నగారి గొంతూ, పెరట్లో పనివాళ్లను అజమాయిషీ చేసే అమ్మ కంఠమూ, ఇవన్నీ కలగాపులగంగా వినిపిస్తాయి.

కానీ ఆ రోజు శ్రీమతి నా భుజం తట్టి లేపింది. అలా గతంలో నాలుగైదుసార్లు మాత్రమే జరిగింది. పెద్దమ్మాయికి హైఫీవర్ వచ్చినపుడూ, పెరట్లో నూతిపళ్ళెం దగ్గర కాలుజారి అమ్మ పడినపుడూ, రెండో అమ్మాయి కడుపులో ఉండగా తనకు విపరీతమైన నొప్పి వచ్చినప్పుడూ, మరోసారి శ్రీమతి నన్ను నిద్రలేపింది, మామూలు టైముకంటే ముందుగా.

నేనింకా బద్ధకపు ముసుగులో ఉండగానే "ఏమండీ... లేవండీ..." అనే శ్రీమతి మాటలూ, పక్క గదిలోంచి అరుపులతో కూడిన ఏడుపూ వినిపించాయి. ఒక్క ఉదుటున దుప్పటి పక్కకు తోసి, మంచం దిగి శ్రీమతివైపు చూశాను. శ్రీమతి మొహం నిర్వికారంగా ఉంది. తరచి చూసిన నాకు తన మొహంలో నిర్వికారంతోపాటు విచారమూ, ఆందోళనా కూడా గోచరించాయి. ఆమెను పట్టి కుదుపుతూ "ఏమిటి మనూ? ఏమైంది? ఎవరలా ఏడుస్తున్నారు?" అన్నాను. అంతవరకూ అణచిపెట్టుకున్న



విచారం పైకి తన్నుకొచ్చింది కాబోలు. ఓ వేలిని నోటికడ్డం పెట్టుకుని "మావయ్యగారు..." అంటూ తల క్రిందికి దించుకుంది

"నాన్నగారికేమైంది? చెప్పు వసూ..." అంటూ ఆమె చుబుకం క్రింద చేయి వేసిన నాకు, ఆమె కనుకొలుకులనుంచి జారిన కన్నీళ్ళు తగిలాయి.

మత్తు పూర్తిగా వదిలిపోయింది నాకు.

వెర్రివాడిలా ఆమె వైపు చూసి పక్కగదిలోకి పరుగెత్తాను.

ఆ గదిలో... మంచం మీద నిలువునా పడుకుని ఉన్నారు నాన్నగారు. మంచం పక్కనే నేలమీద కూర్చుని తలను మాటి మాటికీ మంచం పట్టీకి బాదుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది అమ్మ. గుమ్మంలోంచి బాణంలా దూసుకుపోయాను మంచం దగ్గరకు. మనసు కీడును శంకిస్తోంటే నాన్నగారి ముక్కు దగ్గర వేళ్ళుంచి చూసి అదిరిపడ్డాను. తరువాత ఛాతీమీద చెవి ఆన్చి విన్నాను.

ఒకటి...

రెండు...

మూడు...

పది సెకన్లు చెవులు రిక్కించి విన్నా ఏ శబ్దమూ వినిపించలేదు నాకు. వెంటనే గిరుక్కున వెనుదిరిగి ఇంట్లోంచి బయటపడి పక్కవీధిలో ఉన్న డాక్టర్ వద్దకు చేరుకున్నాను. ఆయన్ని నిద్రలేపి మా ఇంటికి తీసుకొచ్చేసరికి పది నిముషాలు గడిచాయి.

ఆ పది నిముషాల్లో నాలో విపరీతమైన టెన్షన్!

నేనింటికి తిరిగి వెళ్ళేసరికి నాన్నగారు లేచి కూర్చుంటే ఎంత బాగుంటుంది?! ఎప్పటిలా ఆయన పేపర్ చదువుతూ వాలు కుర్చీలో కూర్చుని ఉంటే ఎంత ప్రశాంతంగా ఉంటుంది?!

నాకు నచ్చిన దృశ్యాల్ని మనసులో ఊహించుకుంటూ డాక్టర్‌తో తిరిగి వెళ్ళేసరికి ఇంటినిండా జనం కనిపించారు. నేనింట్లో లేని పది నిముషాల్లోనూ విషయం తెలిసి ఇరుగు పొరుగువాళ్ళు చేస్తున్న పనులు వదిలేసి అంతా మా ఇంటికి చేరారు.

మా అమ్మాయి లిద్దరూ బిక్కమొహాలు వేసుకుని నాన్నగారి మంచం వద్ద నిలబడ్డారు. ఆడవాళ్ళు కొంతమంది అమ్మ చుట్టూ, మరికొంతమంది శ్రీమతి చుట్టూ చేరి దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తోన్న అమ్మనూ, నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రోదిస్తోన్న శ్రీమతినీ, ''ఊరుకోండి... ఊరుకోండ''ని ఓదారుస్తున్నారు.

మగవాళ్ళు నాన్నగారి చుట్టూ చేరి, కొందరు నాడి, మరికొందరు శ్వాస, పరిశీలిస్తున్నారు. ఒకళ్ళిద్దరు విసనకర్రలు తీసుకుని ఆయనకు విసురుతున్నారు.

వారినందర్నీ తప్పించుకుని నాన్నగారి వద్దకు చేరి, స్టెత్ మెడలో వేసుకున్నాడు డాక్టర్. అరనిముషం సేపు స్టెత్‌తో పరీక్షించి, ఛాతీమీద రుద్ది, ఇంకా రకరకాల పద్ధతుల్లో ఆయన్ని పరీక్షించి, చివరకు మెడలోంచి స్టెత్ తీసి చేత్తో పట్టుకుని, నోటితో ఏమీ చెప్పలేక, నావైపు చూశాడాయన.

తరువాతి కార్యక్రమాలు నా ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. దగ్గర బంధువులకు టెలిగ్రాములు ఇవ్వడం, దూరపు చుట్టాలకు ఉత్తరాలు వ్రాయడం, అంత్యక్రియలకు కావలసిన ఏర్పాట్లు చేయడం, ఇరుగుపొరుగువారి సహకారంతో జరిగిపోయాయి.

మర్నాటికి దగ్గర ఊళ్లలో ఉన్న బంధువులంతా వచ్చేశారు. ఆ సందడిలో, ఒకానొక

సమయంలో, నా ఇంట్లో నేనున్నానా? లేక ఎవరింటికైనా వెళ్లానా? అనిపించింది.


నాకు అన్నదమ్ములు లేరు. ఉన్న ఇద్దరు చెల్లెళ్లూ వేరే ఊళ్ళలో ఉంటున్నారు. కబురందిన వెంటనే బయలుదేరి తమ భర్తా, పిల్లలతో మర్నాడు మధ్యాహ్నానికి వాళ్ళూ వచ్చారు. ఇంట్లో మనుషుల సందడి, పనుల హడావుడి... వీటి మధ్య అసలు నాన్నగారు చనిపోయారనే విషయాన్ని మననం చేసుకోవడానికే నాకు తీరిక లేదు.

మనుషుల సలహాలు, పనులు అన్నీ యాంత్రికంగానే ఉన్నాయి నాకు. మర్నాడు సాయంత్రం దహన క్రియలు పూర్తయ్యాయి. స్మశానంలో ఉన్నంతసేపూ నా మనసు ఇహలోకంలో లేదు. చితికి నిప్పంటిస్తున్నప్పుడు చేతులు వణికాయి. బతికున్న మనిషిని నా చేతుల్తో కాలుస్తున్న భావన మనసును పట్టి కుదిపివేసింది. చితిమీద పేర్చిన ఒక్కో కట్టే కాలుతూ మంటల్ని పైకి ఎగదోస్తోంటే ఆ దృశ్యాన్ని చూడలేక మొహం పక్కకు తిప్పుకున్నాను.

సగం కాలిన కట్టెలు చితి మీద నుంచి జారి క్రింద పడుతోంటే, ఓ పొడవాటి కర్రతో వాటిని తిరిగి చితిమీదకు నెడుతోన్న కాటికాపరి నా కళ్ళకు మనుషుల్ని కాల్చుకు తినే రాక్షసుడిలా కనిపించాడు.

'చిన్నప్పుడు నన్నాడించి, ముద్దుచేసి, నా కోరికలు తీర్చి ఇంతటివాణ్ణి చేసిన నాన్నగారు, ఇహ నాకు కనబడరు. నేను జీవితంలో ఆయన్నిక చూడలేను' అనే ఆలోచన మనసు లోపలి పొరల్లోంచి బయటకు తన్నుకొస్తోంది.

ఒక రకమైన దుఃఖోద్వేగం వళ్ళంతా ఆవరించి, నా దేహం నిలువెల్లా వణుకుతోంది. కళ్లలో నీళ్ళు ఉబికి ఉబికి వస్తున్నాయి. గొంతంతా పట్టేసినట్టుగా ప్రపంచంలోని దుఃఖమంతా నా గొంతులోనే గూడు కట్టుకుని ఉన్నట్టుగా చిత్రమైన భావన నన్ను కదిపివేస్తోంది. నేనెందుకిలా అయిపోతున్నానో నాకే తెలియడం లేదు. ఆప్తులు



చనిపోయినపుడు ఇంతటి దుఃఖం ఎందుకు కలుగుతుంది? మనకు సంబంధించని వాళ్ళు పోతే ఇంత బాధ కలగదేం?

'ఈ వ్యక్తి నావాడు' అనుకోవడంలో బాధ ఉందా? సృష్టిలో జరిగే ఎన్నో సహజమైన కార్యాల్లో చావుకూడా ఒకటని నా మనసుకు ఎందుకు అనిపించడం లేదు? ఎంత సర్దిచెప్పుకుని మామూలుగా ఉందామన్నా, నా మనసెందుకు సహకరించడం లేదు? అలా సహకరించకపోవడం కూడా సహజమే కావడంవల్లా? స్మశానంనుంచి ఇంటికి చేరుకున్నా, ఇవే ఆలోచనలు నాలో.

బంధువుల పిల్లల్తో చేరి అటూ ఇటూ పరుగెత్తుతూ ఆడుకుంటోన్న మా పిల్లల్ని చూసి అనిపించింది. నేను చచ్చిపోయాకకూడా వీళ్ళిద్దరూ ఇప్పుడు నేననుభవిస్తోన్న బాధనే అనుభవిస్తారా? అప్పుడు వాళ్ళ పిల్లలు ఇలాగే కల్మషం లేని మనసులతో ఇంత హాయిగానూ ఆడుకుంటారా? ఆ రాత్రి నాకు నిద్ర లేదు. ఏవేవో ఆలోచనలతో మెదడంతా వేడెక్కి, కళ్ళకు నిద్రను దూరం చేసింది.

మర్నాడు దగ్గర ఊళ్ళవాళ్లంతా తిరుగు ప్రయాణం కట్టారు. ఇంట్లో కాస్త సందడి తగ్గాక ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళు — నా మేనమామ, పినతండ్రి, మా నాన్నగారి స్నేహితుడు చలపతి, నేను కూర్చున్న చోటికి వచ్చారు. వరండాలో ఉన్న స్తంభానికి ఆనుకుని కూర్చుని ఉన్నాను నేను శూన్యంలోకి చూస్తూ.

నా చేతికి ఓ కాగితం అందిస్తూ "నిన్న, మొన్నా అయిన ఖర్చుల వివరాలు రాశాను చూడు" అన్నాడు మావయ్య.

"నీ దగ్గరే ఉంచు మావయ్యా, నేనేం చేసుకుంటాను దాన్ని" అన్నాను నేను ఆ కాగితాన్నందుకునే ప్రయత్నం చేయకుండా.

"అలా కాదురా..." అంటూ ఏదో చెప్పబోయాడాయన. అంతలోనే నేనన్నాను "ఆ లెక్కలన్నీ నాకొద్దుగానీ, ఎంత ఖర్చయిందో చెప్పు. ఇచ్చేస్తాను."

ఎందుకంటే గత రెండురోజుల్లోనూ, నా చేత్తో ఎవరికీ నేను నయాపైసా ఇవ్వలేదు. పనులన్నీ వాళ్ళే చూసుకున్నారు. నన్నెవరూ డబ్బడగలేదు.

"దానికి తొందరేం లేదులే. అయినా ఇంతవరకూ అయిన ఖర్చెంతో ఓసారి తెలుసుకుంటే మంచిది కదా, దాన్నిబట్టి దశాహంనాడు ఖర్చు పెట్టాల్సిన మొత్తం గురించి ఓ అంచనాకు రావచ్చును కదా అని నీకు చూపించబోయాను" అన్నాడు మావయ్య.

"దశాహంనాడు ఖర్చుపెట్టడమేమిటి?" అన్నాను నేను ఆశ్చర్యాన్ని స్వరంలో మిళితం చేసి.

మావయ్య తెల్లబోయాడు. కాస్సేపటికి తేరుకుని అన్నాడు "అదేం ప్రశ్నా? అసలు నువ్వు మామూలుగా ఉన్నావా?"

"ఏ నాకేమొచ్చింది? నేను బాగానే వున్నానే!" అన్నాను నేను మరింత ఆశ్చర్యంగా.

"అదేరా, ఆఖరి రోజు కర్మ చేశాక, బంధువులకూ, ఊళ్ళోవాళ్లకూ భోజనలు

పెట్టే కార్యక్రమం ఉందిగా?'' అన్నాడు మావయ్య అదోలా నా వైపు చూస్తూ.

''అదా? ఆ విషయంలో మీరేమీ దిగులు పెట్టుకోకండి'' అన్నాను నేను. నా మాటలు సరిగా అర్థమైనట్టు లేవాయనకు. అందుకే కాబోలు ప్రశ్నార్థకంగా చూశాడు నా మొహంలోకి.

అప్పుడు చెప్పాను మావయ్యకు — నా మనసులోని మాటను. నేను చెప్పింది విన్నాక తాడెత్తున లేచాడు మావయ్య. ''ఏవిటీ? అసలు దశాహమే చేయవా? మతుండే మాట్లాడ్తున్నావా నువ్వు?''

చిన్నాన్న, నాన్నగారి స్నేహితుడు చలపతి, నా వైపు కళ్ళింతలు చేసుకుని చూడసాగారు.

''నీకా అనుమానమెందుకొచ్చిందీ'' అన్నాను నేను.

''అనుమానం రావడమా? నీ తలతిక్క మాటల్తో పిచ్చెక్కేలా వుంది నాకు'' అన్నాడు మావయ్య.

''నువ్వంతగా గింజుకుపోవాల్సిందేవుందో నాకర్థంకావడం లేదు'' అన్నాను నేను.

''హు... నువ్వేం మాట్లాడుతున్నావో నీకర్థమవుతోందా? తండ్రి పోయిన్నాడు శిరోముండనం చేయించుకోవాలిరా అంటే ఏదేదో వాగావు. పిండప్రదానానికీ అర్థంపర్థం లేకుండా ఏదేదో మాట్లాడావు. ఇప్పుడు మళ్ళీ... ఇది. నిన్నేమనుకోవాల్రా?'' స్వరం పెంచి అన్నాడు మావయ్య.

''తండ్రిపోయాక శిరోముండనం చేయించుకోవాలని మీరంతా నాకు నచ్చజెప్పచూశారు. ఎందుకు చేయించుకోవాలని నేనంటే నేనేదో బూతు మాట్లాడినట్టు నన్నంతా అసహ్యించుకున్నారేగానీ, సరైన సమాధానం ఎవరూ చెప్పలేదు.

తల జుట్టుంటే నూనె రాసుకుంటాం. నూనె రాసుకున్నా, రాసుకోనకపోయినా తల దువ్వుకుంటాం. తల దువ్వుకున్న మనిషి, దువ్వుకోని వాడి కంటే కొంచెమైన శుభ్రంగా కనిపిస్తాడు. శుభ్రంగా ఉన్నవాడి మనసు



రాళ్ళు

సర్వర్‌తో కోపంగా అన్నాడు అవతారం—
''ఇదిగో ఈ అన్నంలో ఇరవై రాళ్ళున్నాయి సర్వరూ!''
''క్షమించండి! అంతకంటే ఎక్కువ వేయంసార్!'' వినయంగా చెప్పాడు సర్వర్.

—పద్మశ్రీ (మాణిక్యారం)

లో ఎంత దిగులున్నా, చూసేవారికి దిగులుగా ఉన్నట్టు కనబడదు. అలాగే ఈ పదకొండు రోజులూ గడ్డం చేసుకోకూడదని అనడానికి కారణం కూడా అదే. దిగులుగా ఉన్నవాడికీ, మామూలు మనిషికీ చూడగానే పైకి కనిపించే తేడా మాసిన గడ్డమే.

శిరోముండనం చేయించుకోవడం, గడ్డం గీయించుకోకుండా ఉండడం — ఇవన్నీ మనిషి మనసులోని దిగుల్నీ, విర్వికారాన్నీ, బయటి మనుషులకు తెలియజెప్పేటందుకే! ఇవన్నీ అమలుపరిస్తే తప్ప నాన్నగారి మరణానికి నేను బాధపడుతున్నట్టు కాదా?

అలాగే రోజూ పిండప్రదానం చేయడం. శాస్త్రోక్తంగా మంత్రాలు చదివి శ్రాద్ధాలు పెడ్తే, ఇంకా ఆ చుట్టుపక్కలే ఉన్న నాన్నగారి ఆత్మ, ఆ పరిసరాల్లో ఎదురుముదురుగా తిరుగుతోన్న కాకుల్ని ఆవహించి, నేను పెట్టిన పిండాలను తినడానికి వస్తుందా? ఎన్ని ఎక్కువ కాకులు, పిండాల్ని ముట్టుకుంటే, నేనంత స్రమకంగా కర్మకాండ నిర్వర్తించినట్టు. ఒకవేళ ఏ కాకీ ఆ దరిదాపులకు రాకపోతే జరిపిన కర్మకాండకు ఆయన సంతుష్టులు కానట్టు! ఈ రకమైన ఆలోచనకేమైనా అర్థం ఉందా?

పిండ ప్రదాన సమయంలో అక్కడ చేరిన జనసంఖ్య ఎక్కువగా ఉంటే భయంవల్ల ఏకాకీ పిండం తినేందుకు ధైర్యం చేసి రాకపోవచ్చు. అప్పటికే వాటి కాకలి తీరి ఉన్నా అవి రాకపోవచ్చు. ఇంకా చుట్టుపక్కల పొగలాంటిదేమైనా ఎక్కువగా ఉన్నా అవి రాకపోవచ్చు. అవి రాకపోవడానికి కారణాలు ఆ విధంగా విశ్లేషించడం మానేసి 'మీ నాన్నకు నీమీద కోపంగా ఉంది. అందుకే రాలేదవో, మువ్వాయన చివరికోరిక తీర్చుండవు. అందుకే రాలేదవో' చేసే వ్యాఖ్యానాలకేమైనా అర్థం ఉందా?'' అన్నాను.

నా మాటలకు ఎగతాళిగా నవ్వి అన్నాడు మావయ్య. ''ఒరే నీపాటి తెలివితేటలు కర్మకాండను నిర్దేశించినవాళ్లకు లేవనుకోకు. ఒక వ్యక్తి మరణించాక, దహన క్రియల తర్వాత నిత్యకర్మలు చేయించడానికి గల శాస్త్రోక్తమైన కారణాలు నీలాంటి మూర్ఖులకు చెప్పినా అర్థం కావు. కానీ వాటి వెనుక ఉన్న మరో కారణమేమిటంటే — ఆప్తుల్ని కోల్పోయిన వ్యక్తి అపరిమితమైన దుఃఖంలో ఉంటాడు. దాన్నించి అతడి మనసును మరలించడానికి ఏదో పని ఉండాలి.

చనిపోయిన వ్యక్తి ఆత్మకు ముడిపెట్టి నిర్వహించే ఇటువంటి తంతు జరిపించడం వల్ల తాత్కాలికంగానే అయినా కొంతవరకు బాధను మరిచిపోయే అవకాశం కలుగుతుంది.

కాకులు పిండాన్ని ముట్టుకోవడాన్ని, కర్మను సరిగా నిర్వర్తించడానికి ముడిపెట్టడానికి గల కారణం కూడా బాధలో ఉన్న మనిషిని తాత్కాలికంగా సంతోషపరచడమే.

బ్రతికుండగా తల్లిదండ్రుల పట్ల తమ బాధ్యతను నిర్వర్తించలేకపోయామని, వారు చనిపోయాక పశ్చాత్తాపపడే ఎక్కువమంది కొడుకుల మనసులను తృప్తిపరచడానికి — ఆ విధంగా ముడిపెట్టడం జరిగింది. 'బ్రతికుండగా బాధ్యతల్ని నిర్వర్తించలేకపోయినా, చనిపోయిన తర్వాతైనా తర్పణాలు వదిలి రుణం తీర్చుకున్నాం' అని సంతోషపడే

అవకాశం, సంతానానికి కల్గించడమే ఈ తంతు వెనకవున్న ఆంతర్యం.

'చావులకూ, పెళ్ళిళ్ళకూ, బంధువులకూ, స్నేహితులకూ వర్తమానాలు పంపడమెందుకు?'' అనికూడా అనగలవు నువ్వు. ఇంత వితండంగా మాట్లాడినవాడివి, అది మాత్రం అనకుండా ఉంటావని ఎలా అనుకుంటాం? వాళ్లంతా వచ్చి ఓదారిస్తే తప్ప నీ దుఃఖం తగ్గదని కాదు అందర్నీ పిలవడం.

తనక్కావాల్సిన వాళ్లతో చుట్టూ సందడిగా ఉంటే తాత్కాలికంగా బాధను మర్చిపోతాడు మనిషి. పైగా ఫలానా వ్యక్తి ఫలానా సమయంలో మరణించాడని అందరికీ తెలుస్తుంది. ''అలా తెలియాల్సిన అవసరమేముందని'' చచ్చు ప్రశ్న వేయకు. ఆడపిల్ల రజస్వలైనపుడు అందర్నీ పిలిచి హడావుడి చేస్తారు. ఎందుకు? అర్థం లేక కాదు. 'త్వరలో మా అమ్మాయికి పెళ్ళి వయసు రాబోతోంది' అని నలుగురికీ తెలియజెప్పేటందుకే ఆ తంతు.

నీలాంటి తలతిక్కవాళ్ళు ఇప్పుడిప్పుడే బయల్దేరి 'పేపర్లో ప్రకటన ఇస్తే చాలదూ, తగిన అర్హతలున్నవాడూ, మన తాహతుకు తగ్గవాడూ వెదుక్కుంటూ వస్తాడు'' అనే ఆలోచనతో ఆ తంతులకు మంగళం పాడేస్తున్నారు. ప్రకటనలద్వారా చేసే పెళ్ళిళ్ళలో ఎన్ని విజయవంతమవుతున్నాయో, అలాకాకపోవడానికి గల కారణాలేమిటో, ఎన్నడైనా ఆలోచించి ఉంటారా ఇటువంటి కూతలు కూసే వాళ్ళందరూ?

దుఃఖం నలుగురితో పంచుకుంటే తగ్గుతుంది. సంతోషం పదిమందితో పంచుకుంటే పెరుగుతుంది. అందుకే చావు తంతునూ, పెళ్ళినీ కూడా ఆర్భాటంగా నలుగురి సమక్షంలోనూ నిర్వహించడం.''

చిన్నాన్న, చలపతి మావయ్యవైపు మెచ్చుకోలుగా చూశారు.

'మా బాగా చెప్పావన్నట్టుగా'

నేనూ ఊరుకోలేదు.



## సలహా

ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వాన్ని స్థాపించటానికి కారణం 'అయోధ్య' సమస్య అనేది నిర్వివాదాంశం! అయితే వి.పి. సింగ్ దృష్టిలో మాత్రం ములాయమ్‌సింగ్ యాదవ్ జనతాదళ్‌ను చీల్చటం వల్లనే యు.పిలో బి.జె.పి గెలవగల్గింది! అందువల్లనే బి.జె.పి కార్యాలయంలో ములాయమ్‌సింగ్ ఫొటో పెట్టుకోవాలని వి.పి. సింగ్‌గారు సలహా ఇస్తున్నారు. మరి వి.పి. గారు ప్రధానమంత్రి ఎవరిమూలంగా అయ్యారో కూడా సెలవిస్తే బాగుండేదేమో?

జూపిటర్

''నువ్వు చెప్పిందంతా నిజమని నేనొప్పుకోను. నీలాంటి పెద్దలు నిర్దేశించిన సంప్రదాయాలు, ఆచారాలే మధ్యతరగతి మనుషుల్ని మూఢుల్ని చేస్తున్నాయి. తాహతుకు మించిన ఆడంబరాలకు పోయేలా చేస్తున్నాయి. 'తన బంధువు పదివేలు ఖర్చుచేసి కర్మకాండ నిర్వర్తిస్తే తను కనీసం పదివేల ఒక్క రూపాయైనా ఖర్చుపెట్టి నిర్వర్తిస్తేనే తనకు బంధువర్గంలో గౌరవం' అని భావించే స్థితికి వచ్చాడు నేటి మధ్యతరగతి మనిషి.

అందుకు కావాల్సిన డబ్బు చేతిలో లేకపోతే అప్పు చేస్తాడు. అప్పు పుట్టకపోతే నగలో, అవీ లేకపోతే ఇంట్లోని పాత సామాను అమ్మో ఇటువంటి కార్యాలు నిర్వర్తిస్తున్నాడు. 'కేవలం పక్కవాడికంటే తను తక్కువ కాదు? అని నిరూపించుకుందుకు. దీన్ని భేషజమంటారా? సంఘజీవిగా తన విధుల్ని సక్రమంగా నిర్వర్తించడమంటారా?

ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత ప్రతిరోజూ నిత్యకర్మలు నిర్వహించి, దశాహం రోజున చావులోనూ, పెళ్ళిలోనూ తప్ప ఇతరత్రా కష్టాలొచ్చిన సందర్భాల్లో ఎన్నడూ మొహంకూడా చూపించని బంధువులనూ, స్నేహితులుగా చలామణీ అయ్యేవారినీ పిలిచి ఆర్భాటంగా భోజనాలు పెట్టడమెందుకు?

ఇలా అందర్నీ పిలిచి, తాహతుకు మించిన ఖర్చులు చేస్తేనేగానీ మనిషికి అప్తులు పోయిన దుఃఖంనుంచి విముక్తి కలగదా? తన ఆదాయాన్ని బట్టి ఒక ప్రణాళిక ప్రకారం జీవనం సాగిస్తోన్న మధ్యతరగతి మనిషి' ఆర్థిక స్థితి ఇటువంటి సనాతన సాంప్రదాయాలను పాటించడంవల్ల ఎంత అల్లకల్లోలంగా మారుతుందో ప్రతివారికీ తెలుసు. అయినా, కేవలం తనూ సంఘంలోని మిగిలిన వారికంటే భిన్నమైన వాణ్ణి కానని నిరూపించుకుందుకూ, ఎవరి చేతా వేలెత్తి చూపించకుండా ఉండేందుకు మాత్రమే ఇటువంటి తంతుల్ని నిర్వహిస్తున్నాడు మనిషి.

సంప్రదాయాలను గౌరవిస్తున్నామన్న భ్రమలో ఎప్పటికప్పుడు ఆత్మవంచన చేసుకుంటూ ఖర్చులు పెట్టడంవల్లే ఎన్నటికీ మధ్యతరగతి మనుషులుగానే ఉండిపోతున్నారు మనలాంటి మధ్యతరగతి వాళ్ళు. దీనికి అంతం ఎప్పుడు?''

ఈసారి చిన్నాన్న కలగజేసుకున్నాడు ''నాకు మగపిల్లలు లేకపోయినా నేనెన్నడూ బాధపడలేదు. అన్నకొడుకువి నువ్వున్నావు కదా, నువ్వైనా పున్నామ నరకంనుంచి నన్ను తప్పిస్తావనే ఆశతో ఉన్నానిన్నాళ్ళు. కన్నతండ్రి కర్మకాండ నిర్వహించడానికే ఇంత బాధపడిపోతున్నవాడివి, ఇహ నేను చస్తే కనీసం నా శవాన్ని చూడ్డానికైనా వస్తావని నేననుకోవడం లేదు. రావాలని నేను కోరుకోవడం లేదు కూడా.

వయసు వేడిలో ఉన్న నీకు, మేమేం చెప్పినా అర్థం కాదు. నువ్వూ జీవితంలో అనుభవాలు చవిచూశాక, నీకూ మా వయసొచ్చాక అప్పుడు ఖచ్చితంగా అర్థమౌతుంది, మేం చెప్తోన్న మాటల సర్థం. కానీ ఏంలాభం? అప్పటికి మేం ఉండం. అప్పుడు నీకర్థమైనా నువ్వు పశ్చాత్తాప పడడంకం

ఓ ప్రయోజనముండదు. గుర్తుంచుకో. నువ్వు పిలిచి భోజనం పెట్టే వాళ్ళందరూ, వాళ్ళింట్లో తిండి లేక నీ ఇంటికి రావడం లేదు.''


''అదే నేనూ అంటున్నాను. తిండికి లోటువాళ్ళను పిలిచి భోజనాలు పెట్టడంవల్ల చనిపోయినవారి ఆత్మకు శాంతి కలుగుతుందని నేననుకోను. అందుకే దశాహంవాడు బంధు బలగాన్ని పిలిచి భోజనం పెట్టే కార్యక్రమానికి స్వస్తి చెప్పదలచుకున్నాను.

చనిపోయిన తర్వాత, ఒక సంవత్సరం వరకూ నెలనెలా జరిపే కర్మలూ, తరువాత ప్రతి సంవత్సరమూ జరిపే సంవత్సరీకాలూ -- ఇవన్నీ పోయిన మనిషిని స్మరించుకుందుకు నిర్దేశించినవే అని తెలుసు నాకు. నీలాంటి పెద్దలు — మనకు ఒక సంవత్సరం గడిస్తే, స్వర్గస్థులైనవారికి ఒక రోజు గడుస్తుందని, అందుకే ఏటా నిర్వహించే ఆబ్దికాలవల్ల ప్రతిరోజూ వారికి భోజనం పెట్టినట్టవుతుందని చెప్పినా నేను నమ్మను.

విస్తళ్ళలో వదిలేసిన పదార్థాలకోసం గుమ్మం బయట ఎదురుచూపులు చూసే ముష్టివాళ్లను చీదరించుకుంటాం. వంట పదార్థాలున్న ప్రదేశంలోకి కుక్కలు వస్తే వాటిని తరిమి తరిమి కొడతాం. అది బాగాలేదనో, ఇది బాగాలేదనో, ఆరోగ్యం బాగుండలేదనో, ఇది నాకు నచ్చదనో అనే మనిషికి మాత్రం బతిమాలి, కొసరి కొసరి వడ్డిస్తాం. అది మన సంప్రదాయం. భూత దయ, సాటి మనిషిపట్ల కరుణ చూపించాలని మనకనిపించదు. ఆ విషయం అసలు మన ఊహల్లోకి కూడా రాదు.

అందుకే ఏటా ఆబ్దికాలు నిర్వహించడం కాకుండా ఆ రోజున తిండిలేని అనాథలకూ, ముష్టివాళ్లకూ నా తాహతుకు తగినంతమందికి భోజనం పెడతాను. ఆ విధంగా ఆ రోజున కన్న తండ్రిని స్మరించుకుంటాను'' దృఢంగా అన్నాను నేను.

నేను చెప్పింది విన్న తర్వాత నాన్నగారి స్నేహితుడు చలపతి అన్నాడు ''చూడు



బాబూ ఏటికి ఎదురీదడం కష్టమని అందరి కీ తెలుసు. అందరూ వాలుగా ఈదుతున్నారు కనుక, నేనొక్కణ్ణే ఎదురీదుతాను, వాళ్ళయినా నేనైనా చేసేపని ఈదడమేకదా? అనొచ్చు కొంతమంది నీలాంటి వాళ్ళు.

బంగారం ఎంత ఖరీదైనా, అందరూ బంగారంతో చేసిన నగలే ధరిస్తున్నారు. నీలాంటివారు అందుకు కారణాలన్వేషించి, బంగారమైతే మెరుపు పోకుండా ఉంటుంద నే కదా అంత ఖరీదైనా కొన్ని బంగారు నగలు చేయించుకుంటున్నారు? స్టీలుకున్న మెరుపుకూడా పోదుకదా? స్టీలుతో చేసిన నగలెందుకు వేసుకోకూడదు? పైగా ఎంతో చవకకూడా కదా? అనొచ్చు.

అటువంటి వ్యాఖ్యానాలు వినడానికి ఎబ్బెట్టుగా ఉన్న, కొందరు ఇతర లోహాలతో చేసిన నగల్ని ధరించడం ప్రారంభిస్తే మిగిలినవారూ అదే ప్రారంభిస్తారు, కారణ మేదైనాసరే, మనుషులది మందలో నడిచే గొర్రె మనస్తత్వం. అయితే అలా ముందుగా ఒక కొత్త పని ప్రారంభించడానికి ఎంతో ఆత్మస్థయిర్యం కావాలి.

యాభైఏళ్ళ క్రితం మనుషుల మధ్య ఉన్న అనురాగాలు, ఆప్యాయతలు ఇప్పుడు లేవు. అప్పటి ఆచారాలూ ఇప్పుడు లేవు. ఇప్పుడు సమాజం పాటిస్తున్న ఆచారాలూ, సంప్రదాయాలూ, మరో యాభై ఏళ్ళు గడిచాకా ఉండకపోవచ్చు. లేదా మరో రకంగా మార్పు చెందవచ్చు. మారుతోన్న కాలంతోపాటు ధర్మాలూ, విలువలూ మారుతోంటాయి. అది సహజం.

కానీ ఒక్క విషయం మాత్రం చెప్పదలిచాను. నలుగురూ నడిచే దారిలో నడవడం లో సుఖం ఉంది. ఆ సుఖం వంటికీ, మనసుకూ కూడా లభిస్తుంది. 'నాకు ఆ సుఖం అక్కర్లేదు, నేను కష్టపడైనా సరే నా వెనుక తరం వారికి కొత్తమార్గం చూపిస్తాను అని నీవనుకుంటే నేను చెప్పేదేమీ లేదు.'

నేనేమీ మాట్లాడలేదు. మరో పది నిముషాల్లో మావయ్య, చిన్నాన్న ప్రయాణా నికి సిద్ధమయ్యారు. వాళ్ళతోపాటు కొంద రు ఆడవాళ్ళూ, పిల్లలూ కూడా బయలుదే రారు.

వెళ్తూ అన్నారు మావయ్య "ఒరే, నీ ఇంటి కొచ్చినందుకు బాధపడుతున్నాను. ఇహ జన్మలో నీ ఇంటికి పెళ్ళికిగానీ, చావుకు గానీ వస్తే, నేను బతికీ చచ్చినవాడిగానే లెక్క! ఎన్నడూ నాకు ఉత్తరం వ్రాయడం గానీ, వర్తమానాలు పంపడం గానీ చేయకు.'

చిన్నాన్నకూడా "నీలాంటి కొడుకుని కనడమే మా అన్నయ్య చేసిన మహాపాపం. నా అదృష్టంకొద్దీ నీలాంటివాడు నాకు కొడుకుగా పుట్టలేదు. అంతే చాలు" అని నాతో విసురుగా అని "పద బావా" అంటూ మావయ్యను తొందరపెట్టాడు.

ఈ గొడవకు ఇంట్లోంచి నా చెల్లెళ్ళూ, బావలూ, మిగిలిన బంధువులూ బయటికి వచ్చారు. క్షణాల్లో వారికి విషయం తెలిసింది. అంతా నన్నో మహాపాపిని చూసినట్టు చూశారు. నోటికొచ్చిన శాపనార్థాలు పెట్టారు. ఎవరేమన్నా, నన్ను కానట్టుగా, బండరాయిలా కదలకుండా కూర్చున్నాను. నేను

సమాధానం చెప్పేకొలదీ వాళ్ళు రెచ్చిపోతారని నాకు తెలుసు. సాయంత్రానికి ఇల్లంతా ఖాళీ అయింది. శ్రీమతీ, పిల్లలూ, నేనూ మిగిలాం.

అంత జరిగినా శ్రీమతి పన్నెత్తి ఒక్క మాట కూడా అనలేదు నాతో. మిన్ను విరిగి మీద పడుతుందన్నా చలించని మనోనిబ్బరం కష్టాల్లోకూడా కిలకిలా నవ్వగల గుండె దిటవు. బాధల్ని సంతోషంగా స్వీకరించగల ఆత్మస్థయిర్యం, ప్రతికూల పరిస్థితులెదురైనపుడు ప్రశాంతంగా ఆలోచించి ముందడుగు వేయగల తెలివీ, ఎదుటివారి దూషణలను పట్టించుకోని రాయిలాంటి జడత్వం — వీటన్నిటినీ స్వంతం చేసుకున్న వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించినందుకు నేను సంతోషించని క్షణం లేదు, మా వివాహమైన నాటినుంచీ.

భోజనాలు చేసి పడుకున్నాక నేనే ఆ విషయం కదిపాను. ''ఇందర్ని కాదని నేను తప్పు చేశానంటావా వసూ?''

శ్రీమతి మొహం ఎంతో నిర్మలంగా వుంది.

ఆ నిర్మలత్వంలో ఎంతో ప్రశాంతత ఉంది.


''ఊహూ'' అని తల అడ్డంగా ఊపి అంది శ్రీమతి ''వాళ్ళన్న మాటలు పట్టించుకోవడంవల్ల బాధపడడంతప్ప ప్రయోజనముండదు. మీ మనసులో ఉన్న ఆలోచనను నిరభ్యంతరంగా అమలు జరపండి. అందుకు నా సహకారం పూర్తిగా ఉంటుంది. సరేనా?''

చాలు! నాకింకేం అక్కర్లేదు. నన్నర్థం చేసుకున్న భాగస్వామి నుంచి లభించిన ఈ ప్రోత్సాహం చాలు నాకు.

* * *

ఆ దృశ్యం ఎంతో బావుంది నాకు.

పెరటి గుమ్మంలో నిలబడి, ఆబగా భోజనం తింటోన్న ఆ పదిమందినీ చూస్తోంటే ఎంతో తృప్తిగా ఉంది నాకు. వంటి మీద



## కొనుగోలు

పెళ్ళిచూపుల్లో పెళ్ళికొడుకు తల్లి —

''అదేంటమ్మాయ్? మా అబ్బాయి అడగాల్సిన ప్రశ్నలన్నీ నువ్వే అడుగుతున్నావ్?''

''బోలెడు డబ్బు పోసి కొనుక్కునేటప్పుడు వస్తువు మంచిచెడ్డలు తెలుసుకోవాల్సింది నేనే కదండీ?'' తక్కువ ఎదురుప్రశ్న వేసింది పెళ్ళికూతురు.

—పి.ధనలక్ష్మి (గుంటూరు —6)

సరైన బట్టల్లేకుండా, పరిసరాల్ని పట్టించుకోకుండా, కేవలం విస్తట్లో పడుతోన్న పదార్థాల వైపు తప్ప చుట్టుప్రక్కలకు దృష్టి సారించకుండా, తదేక దీక్షతో యజ్ఞం నిర్వహించేవారిలా, విస్తట్లోని పదార్థాలను కడుపులోని ఆకలి పిశాచానికి అందజేస్తోన్న వాళ్లను చూస్తోంటే ఎంతో ఆనందంగా ఉంది నాకు.

ఆ రోజుఉదయం, జంక్షన్ దగ్గరున్న పేవ్ మెంట్ మీదున్న ముష్టివాళ్ళ దగ్గరకెళ్ళి విషయం చెప్పినప్పుడు నన్ను అనుమానంగా చూశారు వాళ్ళు. నేను వేళాకోళ మాడుతున్నానేమో అనుకున్నారు ముందు. మా ఇంటి గుర్తులు చెప్పి, అందర్నీ పదిగంటలకు రమ్మని చెప్పినపుడు, నేను నిజమే చెపుతున్నాననే నమ్మకం కలిగింది వారిలో.

ఆబ్దికం రోజున కాళ్లరిగేలా తిరిగి, అజీర్ణ వ్యాధితో బాధపడుతోన్న భోక్తల్ని బ్రతిమాలి తీసుకొచ్చి భోజనం పెట్టడానికీ... ఆకలితో నకనకలాడుతూ అన్నం ముద్ద కనబడితే చాలు, ఆశగా చూసే ఇటువంటి వారికి భోజనం పెట్టడానికీ గల వ్యత్యాసం, ఆ వ్యత్యాసం వలన కలిగిన మానసిక తృప్తీ ఎంతో స్పష్టంగా, ఎన్నడూ మరిచిపోనంతగా తెలుస్తున్నాయి నాకు.

అంతా భోజనాలు చేశాక, మా అమ్మాయి లిద్దరి చేతా వాళ్ళకు బట్టలిప్పించాను. అందరిలోకీ వృద్ధుడిలా కనిపిస్తోన్న ఒకతను మా ఇద్దరి దగ్గరకూ వచ్చాడు.

''బాబూ, ఏ జన్మలో పుణ్యం చేశామో, ముష్టిబతుకు బతుకున్న మాలాంటి వాళ్లకు ఇంత ఆప్యాయంగా పిలిచి భోజనం పెట్టారు. మా ఆయుష్షుకూడా పోసుకుని మూరేళ్ళు చల్లగా జీవించండి బాబూ. ఎంతో పెద్ద మనుసుంటేతప్ప ఇటువంటి పని చేయడానికి మనసురాదు.

బంధువుల్ని, స్నేహితుల్ని కాదని ఇటువంటి కార్యం చేయడం మానవమాత్రులకు సాధ్యం కాదు. మీరు తప్పుగా అనుకోనంటే ఒకమాట చెబుతాను బాబూ. మనం చేసే పని ఎంత సవ్యమైందైనా బంధువుల్ని, స్నేహితుల్ని పోగొట్టుకోకూడదు బాబూ. కేవలం భార్య, పిల్లలు మాత్రమే మనిషికి సరిపోరు. బంధుబలగం లేని మనిషి సమాజంలో ఒంటరివాడైపోతాడు.

నిత్యవ్యవహారాల్లో తేడా జరగనంత కాలం ఫర్వాలేదు. ఏదైనా తేడా జరిగినపుడు చెప్పుకోడానికి మనిషికావాలి. ఆ సందర్భాల్లో మనిషి తోడు, మాట సాయం లేకపోతే మనిషి మనుగడకే అర్థం లేదు బాబూ. నేనేదైనా తప్పుగా అనివుంటే మన్నించండి బాబూ'' అంటూ రెండు చేతులూ జోడించాడు.

వాళ్ళంతా వెళ్లిపోయాక అంది శ్రీమతి ''బాధపడుతున్నారా?'' ఉలిక్కిపడ్డాను నేను

నిజానికి నేను బాధపడుతున్నానో, సంతోషిస్తున్నానో నాకే తెలియని విచిత్ర స్థితిలో ఉన్నాను నేను ప్రస్తుతం.

*